క్లుప్తంగా

ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దు



చిరు, తోపుడు బండ్ల వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న బుద్దల శ్రీనివాస్

ఏలూరు (టూటౌన్): ప్రజలకు అసౌకర్యం, ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా తోపుడు బండ్లపై వ్యాపారాలను నిర్వహించుకోవాలని ట్రాఫిక్ ఎస్సైలు బుద్దల శ్రీనివాసరావు, శ్రీధర్, వెంకటేశ్వరరావులు కోరారు. ఎస్పీ మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్ద వీధి వ్యాపారాలకు సోమవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తోన్న 27 మందిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట హాజరు పర్చినట్టు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పథకాలు క్షేత్ర స్థాయికి చేరాలి

ఏలూరు రూరల్ : ప్రభుత్వం నుంచి రైతులకు అందించే ప్రతి పథకాన్నీ క్షేత్రస్థాయికి చేరేలా రైతు భరోసా కేంద్ర సిబ్బంది కృషి చేయాలని డీఏఓ గాంధీ అన్నారు. సోమవారం ఏలూరులోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆర్బీకే సిబ్బందితో అధికారులు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఏలూరు మండల గ్రామాల్లో 2,216 మంది రైతులకు కౌలుదారు కార్డులు మంజూరు చేసిందని గాంధీ వివరించారు. ఇందులో ఇప్పటికే 820 మందికి పలు బ్యాంకులు సుమారు రూ.2.50 కోట్లు రుణాలు అందించాయన్నారు. తహసీల్దార్ బి.సోమశేఖర్ మాట్లాడుతూ మిగిలిన రైతులకు సైతం రుణాలు అందేలా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఇందుకోసం బ్యాంక్ మేనేజర్లతో సమావేశాలు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. అర్హత గల ప్రతి రైతుకూ సీసీఆర్సీ కార్డులు మంజూరు చేశామని మండల వ్యవసాయ అధికారిణి జీవనసంధ్య తెలిపారు.

రోయింగ్ జట్టుకు అభినందనలు

ద్వారకాతిరుమల: ఆసియా క్రీడల్లో రోయింగ్ లైట్ వెయిట్ పురుషుల విభాగంలో దేశానికి తొలి పతకం రావడం హర్షణీయమని అంతర్జాతీయ రోయింగ్ క్రీడాకారుడు యు.విజయ్ అన్నారు. స్థానిక విలేకర్లతో సోమవారం ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయి రోయింగ్‌లో పతకాలు సాధించిన భారత రోయింగ్ జట్టుకు, కోచ్ ఇస్మయిల్ బేగ్‌కు అభినందనలు తెలిపారు. వాటర్ స్పోర్ట్స్‌కు మంచి భవిష్యత్ ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడెం ఎర్ర కాలువలో శిక్షణా కేంద్రం నడుస్తోందన్నారు. రాష్ట్ర స్కల్లింగ్ అండ్ రోయింగ్ అధ్యక్షులు తరుణ్ కాకాని క్రీడాకారులకు మంచి ప్రోత్సాహాన్ని ఇస్తున్నట్టు చెప్పారు.

అందరికీ ఉచిత వైద్యం సీఎం జగన్ లక్ష్యం



జగనన్న సురక్ష కరపత్రాలను అందిస్తున్న నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు



బీపీ పరీక్ష చేయించుకుంటున్న మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు

ఏలూరు (టూటౌన్): రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఏలూరు నగర మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. మాజీ మంత్రి, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఆదేశాల మేరకు సోమవారం ఏలూరు 50వ డివిజన్ ఎమ్మార్సీ కాలనీలో ఆరు సచివాలయాల పరిధిలోని కార్పొరేటర్లతో కలిసి ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బందితోపాటు మేయర్ నూర్జహాన్ పెదబాబు గడపగడపకు వెళ్లి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు పరీక్షలు చేయించారు. మేయర్ నూర్జహాన్ బీపీ పరీక్ష చేయించుకున్నారు. ఈ సందర్భంగా నూర్జహాన్ మాట్లాడుతూ పేదల సంక్షేమానికి సీఎం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారని చెప్పారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజారోగ్య సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి బాధ్యత తీసుకుంటున్నామన్నారు. వారం రోజులుగా ఏలూరు నగరమంతా సచివాలయాల వారీగా ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ప్రతి ఇంటికీ వెళ్లి అనారోగ్య సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారని తెలిపారు. బీపీ, సుగర్, టీబీ టెస్టులతో పాటు ఏడు రకాల టెస్టులను చేస్తున్నారని చెప్పారు. వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి డాక్టర్ల పరీక్షల అనంతరం అవసరమైన వారికి చికిత్సలు చేసి, మందులు ఉచితంగా ఇస్తారని వివరించారు. ప్రజారోగ్యానికి చర్యలు తీసుకోవడం ఓ చరిత్ర అన్నారు. ఇటువంటి కార్యక్రమం గతంలో ఏ ప్రభుత్వం చేయలేదని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను దృష్టిలో పెట్టుకుని ప్రజలందరూ సీఎం జగనన్నకు ఎప్పుడూ నిలవాలని కోరారు. కార్యక్రమంలో నగర కో ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, కార్పొరేటర్లు నున్న స్వాతి శ్రీదేవి కిషోర్, దేవరకొండ శ్రీను, డిప్యూటీ కమిషనర్ ఎస్ రాధ, డివిజన్ అధ్యక్షుడు గవరపేట నాయుడు, మానుకొండ శ్రీను, పిల్లా శివ, పెదపూడి రాజు, కుర్మా రాజు, లారీల శ్రీను, ఎం.కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానించిన దృశ్యం

ఏలూరు రూరల్ : ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పెదపాడు ఎంఈఓ సబ్బిత నరసింహమూర్తి, భార్య శేషారత్నంను సోమవారం శనివారపుపేట ఉర్దూ పాఠశాలలో ఘనంగా సన్మానించారు. హెచ్ఎం రహీదా అధ్యక్షతన ఏర్పాటుచేసిన ఈ కార్యక్రమానికి ఎంఈఓ ఎ.రవిప్రకాష్, ఆర్ రంగయ్య ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా రవిప్రకాష్ మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యను అందించడంలో భార్యభర్తలు ఇద్దరూ పోటీపడ్డారని కొనియాడారు. రంగయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పన, బాలబాలికలను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతూ ఇద్దరూ జిల్లా స్థాయిలో అవార్డులు అందుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. సన్మాన గ్రహీతులు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, అవార్డులు, సన్మానాలు మరింత బాధ్యతను పెంచుతాయని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ కాలీష, కాంప్లెక్స్ చైర్మన్ జి.ప్రకాష్, కార్యదర్శి నాగేంద్రసింగ్, బాబుషరీఫ్, ఉపాధ్యాయులు షకీలా, పద్మావతి, సునీత, అనిధ, పేరెంట్స్ కమిటీ సభ్యులు సన్మాన గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.

జూదరుల అరెస్టు

ఏలూరు (టూటౌన్): ఏలూరు పత్తేబాద అపార్టుమెంట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్సు పోలీసులు సోమవారం దాడి చేసి పేకాట ఆడుతోన్న ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ.46,110 స్వాధీనం చేసుకున్నారు. వీరిపై చర్యలు తీసుకోవాలని స్థానిక పోలీసులకు జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అప్పగించారు. ఎస్పీ మేరీ ప్రశాంతి, జిల్లా ఎస్ఈబీ అదనపు ఎస్పీ ఎన్.సూర్యచంద్రరావు, ఎస్ఈబీ డీఎస్పీ ఎం.రమేష్ రెడ్డి ఆదేశాలపై జిల్లా టాస్క్‌ఫోర్సు ఇన్‌స్పెక్టర్ ధనరాజు, కైకలూరు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎస్ రాంబాబు, ఎస్సై అల్లూరయ్య దాడులు నిర్వహించారు. ఈ కేసులో మరో ముగ్గురు పరారయినట్టు తెలిసింది. వారిలో ఇద్దరు కానిస్టేబుళ్లు, ఒకరు రిటైర్డ్ ఏఎస్సై ఉన్నట్టు సమాచారం. ఈ ఘటనపై ఆరోపణలు రావడంతో ఏలూరు డీఎస్పీ ఈ.శ్రీనివాసులు విచారా చేపట్టారు.

వైభవంగా రుద్రాభిషేకం



రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జ్యూట్‌మిల్లు వద్ద ధర్మభేరి ప్రాంగణంలో వాణిజ్యవేత్త నారా శేషు ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న గణపతి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా సోమవారం రుద్రాభిషేకాలు వైభవంగా నిర్వహించారు. పరమేశ్వరునికి ప్రీతిపాత్రమైన భాద్రపద శుద్ధ ఏకాదశి పర్వదినం సందర్భంగా 108 శివలింగాలకు పంచామృతాలతో అభిషేకం, రుద్రాభిషేకం చేశారు. సాయంత్రం వంగూరుకు చెందిన బాలలు ప్రదర్శించిన కోలాట నృత్యం అకట్టుకుంది. అనంతరం స్వామి వారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు.

నేటి నుంచి శ్రీవారి పవిత్రోత్సవాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక రామచంద్రరావుపేట వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఈ నెల 26 నుంచి స్వామి వారి 22వ వార్షిక పవిత్రోత్సవాలు నిర్వహించనున్నట్టు దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్ తోలేటి శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి నాగం సన్యాసిరావు ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి ఉత్సవాలు ప్రారంభమౌతాయని, తొలుత శ్రీమత్ విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం, అంకురార్పణ, దీక్షాధారణ, పవిత్ర అధివాస పూజలు చేస్తారని పేర్కొన్నారు. 27న ప్రధాన కుంభ స్థాపన, సప్తవింశతి (27) కలశాలభిషేకం, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్టాపన, స్వామి వారికి, అమ్మవార్లకు పవిత్ర సమర్పణ, సాయంత్రం శ్రీ విష్ణు సహస్రనామ పారాయణ, చతుస్థానార్చన, మూలమంత్ర హవనాలు, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్టి నిర్వహిస్తారని పేర్కొన్నారు. 28న చతుఃపంచాశ (54) కలశాభిషేకం, చతుస్థానార్చన, శ్రీ సుదర్శన నారసింహ హోమం నిర్వహిస్తామని తెలిపారు. 29న శ్రీవారి మూలమూర్తికి అష్టోత్తర శత (108) కలశాభిషేకం, చతుస్థానార్చన, మూలమంత్రహోమాలు నిర్వహిస్తామని, ఉదయం 10.30 గంటలకు మహాపూర్ణాహుతి అనంతరం పవిత్ర అవరోపణ, ప్రధాన కుంభోద్వాసన, ప్రదక్షిణ పూర్వక కుంభ బింబ సహిత గర్భాలయ ప్రవేశం, కుంభ ప్రోక్షణ, వేద స్వస్తి, మహదాశీర్వచనం, పవిత్ర వితరణ, నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 6.30 గంటలకు స్వామి వారికి ప్రాకార చిన్న గరుడ వాహనోత్సవం నిర్వహించి ఏడు గంటలకు సహస్రదీపాలంకరణ సహిత ఊంజల్ సేవ నిర్వహిస్తారని వివరించారు.

అన్నదానం మహా పుణ్యకార్యం



భక్తులకు స్వామి వారి ప్రసాదం పంపిణీ చేస్తున్న పెదబాబు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అన్నదానం మహా పుణ్యకార్యమని నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. స్థానిక రామచంద్రరావుపేట వర్తక సంఘం ఆధ్వర్యంలో గణపతి నవరాత్రి మహోత్సవాల సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని పెదబాబు ప్రారంభించి మాట్లాడారు. ఉత్సవాలు నిర్వహించే ప్రతి కమిటీ అన్నసమారాధనలు ఏర్పాటు చేయడం ఆహ్వానించదగ్గ పరిణామమన్నారు. తొలుత స్వామి వారికి విశేష పూజలు చేసిన పెదబాబుకు అర్చకులు ఆశీర్వచనం పలికి ప్రసాదం అందజేశారు. నిర్వాహకులు పెదబాబుకు జ్ఞాపిక అందజేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కత్తిరి రామ్మోహనరావు, పోతర్లంక లక్ష్మణ్, కలవకొల్లు సాంబ, సబ్బన శ్రీనివాసరావు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాల నివారణకు సదస్సులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్ ప్రమాదాల నివారణకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని మండలాల్లో విద్యుత్ సెక్షన్ కార్యాలయాల్లో విద్యుత్ భద్రతపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్టు తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ పి.సాల్మన్ రాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆయిల్‌పామ్ చెట్ల ఆకులు, గెలలు కోయడానికి అల్యూమినియం పైపులను వినియోగించవద్దని సూచించారు. అల్యూమినియం పైపులకు బదులు ప్లాస్టిక్ పైపులు లేదా విద్యుత్ వాహక నిరోధక పైపులను వాడాలన్నారు. ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్ లైన్లు ఉంటే సంబంధిత లైన్‌మెన్ వద్ద లైన్ క్లియరెన్స్‌లను తీసుకుని విద్యుత్ సరఫరా ఆపిన తర్వాత లైన్‌మెన్ పర్యవేక్షణలోనే ఆయిల్‌పామ్ ఆకులు లేదా గెలలు కోయాలని అన్నారు. ఆయిల్‌పామ్ తోటల్లో విద్యుత్ లైన్లు ఎత్తు తక్కువగా ఉంటే విద్యుత్ అధికారికి తెలియజేయాలన్నారు. విద్యుత్ అంతరాయం లేదా సమస్య తలెత్తితే టోల్‌ఫ్రీ నెంబర్ 1912కు సమాచారం అందించాలన్నారు. తగిన జాగ్రత్తలు పాటించి విద్యుత్ శాఖకు సహకరించాలని కోరారు.

క్లాప్ ఆటో డ్రైవర్ల ఆందోళన

ఏలూరు (టూటౌన్): మున్సిపల్ క్లాప్ ఆటో డ్రైవర్ల జీతాల్లో అక్రమంగా కోతలు కోసిన డబ్బులు తిరిగి జమ చేయాలని, యాజమాన్యం వేధింపులు ఆపాలని, అక్రమంగా తొలగించిన డ్రైవర్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ స్థానిక స్థానిక వెహికల్ డిపో వద్ద ఆటో డ్రైవర్లు సోమవారం ఆందోళన చేశారు. కనీస వేతనం రూ.18,500, ఇతర చట్టబద్ధ రాయితీలు అమలు చేయాలని నినదించారు. క్లాప్ ఆటోల డ్రైవర్ల యాజమాన్యం డ్రైవర్లపై నిత్యం వేధింపులకు పాల్పడుతోందని, కార్మిక చట్టాలు అమలు చేయడం లేదని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య ఆరోపించారు. వివిధ సంఘాల నాయకులు ఎ.జానుబాబు, జె.గోపి, రవీంద్ర సంఘీభావం తెలిపారు. జి.రాజు,బి.గణేష్,బి.శ్రీను, బి.సుగుణ రావు,పి.శ్రీను పాల్గొన్నారు.

15 మంది అరెస్టు

పెదపాడు: స్థానిక కలపర్రు శివారులో కోడిపందేలు నిర్వహిస్తున్న 15 మందిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై చల్లా కృష్ణ సోమవారం తెలిపారు. 15 మోటారు సైకిళ్లు, రూ.5,600 స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

30న దివ్యాంగుల జాబ్ మేళా

ఏలూరు (టూటౌన్): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ నైపుణ్యం, వృత్తి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని విద్యావంతులైన దివ్యాంగులకు ఉద్యోగావకాశాల కల్పించేందుకు ఈ నెల 30న ఉంగుటూరు మండలం నారాయణపురం డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్టు విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జీసీహెచ్ ప్రభాకర్ సోమవారం పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ / ఇంటర్ / డిగ్రీ / ఐటీఐ / డిప్లొమా / బీటెక్ ఉత్తీర్ణులైన దివ్యాంగులు అర్హులని, జాబ్‌మేళాకు దివ్యాంగులు సాధారణ వస్త్రధారణలో హాజరు కావాలని తెలిపారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 99516 92594లో సంప్రదించాలని కోరారు.

రైలు ఢీకొని యువకుడి మృతి



వెంకట శివ లక్ష్మీనారాయణ (ఫైల్)

ఏలూరు (టూటౌన్): వట్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొని గుంటూరు జిల్లా ఈపూరు మండలం కొచ్చెర్ల గ్రామానికి చెందిన అయినాల వెంకట శివ లక్ష్మీనారాయణ (21) అనే యువకుడు మృతి చెందినట్టు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ ఎస్.ఆదినారాయణ తెలిపారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామన్నారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో శవపంచనామా పూర్తిచేసిన అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించామని హెచ్‌సీ ఆదినారాయణ చెప్పారు.

బాలల పరిరక్షణ అందరి బాధ్యత



బాలల రక్షణపై అవగాహన కలిగిస్తున్న రజిత

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బాలల పరిరక్షణ మనందరి బాధ్యత అని, ఆపదలో ఉన్న బాలలకు రక్షణగా ఉండాలని, 18 సంవత్సరాల్లోపు వయస్సు గలవారందరూ బాలలేనని నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్ డి.రజిత అన్నారు. సోమవారం నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో స్థానిక అశోక్ నగర్‌లోని రాజీవ్ గాంధీ పార్క్‌లో డ్వాక్రా మహిళలకు బాలల పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రజిత మాట్లాడుతూ బాలల అభిప్రాయాలను గౌరవించాలని, వారి మాటలకు విలువ ఇవ్వాలని, వారిని వేధించవద్దని సూచించారు. బాలల పట్ల లైంగిక వేధింపుల ఘటనలు తెలిస్తే వెంటనే పోలీసులను ఆశ్రయించాలని, బాల్య వివాహాన్ని ప్రోత్సహించే తల్లిదండ్రులు, సంరక్షకులకు కూడా శిక్ష పడుతుందని వివరించారు. విద్యార్థి దశ నుంచే సరయిన అవగాహన కల్పిస్తే మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా, సమాజంలో మంచి పౌరులుగా తయారవుతారని చెప్పారు. మత్తు పదార్థాల వ్యసనం నుంచి బయటకు తీసుకురావడానికి నవజీవన్ బాల భవన్ బోస్కో డీ ఎడిక్షన్ సెంటర్ పొలసానిపల్లి గ్రామంలో ఏర్పాటు చేశామని, ఫోన్ నెంబర్ 94904 92020లో సంప్రదిస్తే ఉచితంగా సేవలందిస్తామని అన్నారు. కార్యక్రమంలో నవజీవన్ బాల భవన్ జోనల్ కోఆర్డినేటర్, బి.నేహీమియ, కమ్యూనిటీకి ఆర్గనైజర్ జి.రాజేశ్వరి డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ధరలను అరికట్టడంలో విఫలం



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి రవి

ఏలూరు (టూటౌన్): నిత్యావసర సరుకుల ధరలను అరికట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి అన్నారు. స్థానిక పవరుపేటలోని ఉద్దరాజు భవనంలో పార్టీ ఏలూరు నగర కార్యదర్శి పి.కిషోర్ అధ్యక్షతన నిర్వహిస్తోన్న సీపీఎం కార్యకర్తల శిక్షణా తరగతుల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలు రోజు రోజుకి పెరిగిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు పాడైపోయి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని వివరించారు. ఏజెన్సీ ప్రాంతంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు మొబైల్ వైద్య సేవలను ప్రారంభించాలని కోరారు. సమావేశాల్లో జిల్లాలోని వివిధ ప్రాంతాల శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.

దీన్‌దయాళ్ సేవలు మరువలేం



దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేసిన దృశ్యం

ఏలూరు రూరల్: దివ్యాంగులకు దీనదయాళ్ ఉపాధ్యాయ చేసిన సేవలు మరిచిపోలేమని జిల్లా విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమశాఖ సహాయ సంచాలకులు జీసీహెచ్ ప్రభాకర్ అన్నారు. సోమవారం దొండపాడు బదిరుల వరివర్తన పాఠశాలలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ దీనదయాళ్ ఉపాధ్యాయ జాతీయ దివ్యాంగుల పునరావాస సంస్థను స్థాపించి ఎందరో దివ్యాంగులకు మేలు చేశారని కొనియాడారు. అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, సంపద అందించి బలమైన, సుసంపన్నమైన భారతదేశం నిర్మించడమే దీన్‌దయాళ్ ప్రధాన ధ్యేయమని వివరించారు. కార్యక్రమంలో సంస్థ కోఆర్డినేటర్ డి.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని దీనదయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అంతర్జాతీయ శ్లోక పఠన పోటీలకు భువనశ్రీ



భువనశ్రీని అభినందిస్తున్న జింగిల్ బెల్స్ స్కూల్ ప్రతినిధులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): బెంగళూరుకు చెందిన అంతర్జాతీయ సంస్థ విద్యాధరి ఇనిస్టిట్యూట్ సంస్థ అంతర్జాతీయ స్థాయిలో నిర్వహిస్తోన్న భగవద్గీత శ్లోక పఠన పోటీలకు నగరానికి చెందిన గుబిలి భువనశ్రీ ఎంపికయింది. స్థానిక జింగిల్ బెల్స్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోన్న భువనశ్రీ తన ఐదో ఏట నుంచే శ్లోక పఠనం ప్రారంభించి 700 శ్లోకాలను అనర్గళంగా పఠిస్తోంది. కాగా గత ఏడాది తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన శ్లోక పఠన పోటీల్లో ప్రథమ బహుమతి సాధించింది. త్వరలో బెంగళూరులో నిర్వహించే అంతర్జాతీయ స్థాయి భగవద్గీత శ్లోక పఠన పోటీల్లో భువనశ్రీ పాల్గొననుంది. ఈ సందర్భంగా జింగిల్ బెల్స్ పాఠశాల డైరెక్టర్ వి.సురేష్, ప్రిన్సిపాల్ కె.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు భువనశ్రీని అభినందించారు.

దళితుల పక్షాన నిలిచిన సీఎం జగన్

ద్వారకాతిరుమల: రాష్ట్రంలో దళితుల పక్షాన నిలబడిన ఏకైక నాయకుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని ఎమ్మెల్యే తలారి వెంకట్రావు అన్నారు. శాసనసభలో షెడ్యూల్ కులాల సంక్షేమంపై సోమవారం ఆయన మాట్లాడారు. దళితుల పేరు చెబితే అందరికీ గుర్తుకొచ్చేది దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో దళితులకు ఆయన ఎంతో మేలు చేశారన్నారు. దళితుల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా వైఎస్సార్ పాలన సాగించారని గుర్తు చేశారు. జగన్‌మోహన్ రెడ్డి తండ్రికి మించిన పాలనను అందిస్తూ, దళితుల పక్షాన నిలుస్తున్నారన్నారు. దళితుల సంక్షేమానికి రూ. 65 వేల కోట్లు వెచ్చించినట్టు చెప్పారు. టీడీపీ హయంలో చంద్రబాబు ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను కూడా దుర్వినియోగం చేశారని, దళితుల సంక్షేమానికి రూ.35 వేల కోట్లు మాత్రమే ఖర్చు చేశారని గుర్తుచేశారు. సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మంచిని చూసి ఓర్వలేకే టీడీపీ నాయకులు తమ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని అన్నారు. విజయవాడ నడిబొడ్డున రూ.500 కోట్లతో అంబేడ్కర్ విగ్రహ నిర్మాణాన్ని చేపట్టడం హర్షణీయమన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీలకు ఒక్కొక్కరికీ అరెకరం చొప్పున మొత్తం వెయ్యి ఎకరాలను పంపిణీ చేశామన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో విద్యార్థులు ఉన్నత చదువులు చదువుతున్నారని, విదేశీ విద్యను కూడా పొందగలుగుతున్నారని అన్నారు. ప్రతి మండలానికి ఒక అంబేడ్కర్ కమ్యూనిటీ హాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తలారి కోరారు.

డీఈఎల్ఈడీ పరీక్షలకు 63 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): డీఈఎల్ఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. 64 మంది విద్యార్థులకు 63 మంది హాజరు కాగా ఒకరు గైర్హాజరయ్యారు. మాల్ ప్రాక్టీస్ కేసులేవీ నమోదు కాలేదని జిల్లా విద్యాశాఖాధికారి పి.శ్యామ్ సుందర్ తెలిపారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా విజయవాడ (ఇంద్ర)	21.00	30
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం (ఇంద్ర)	21.00	38
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	33

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	21
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు - జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	32
ఏలూరు బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	28
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	27
ఏలూరు - విశాఖపట్నం	12.00	4840	34
ఏలూరు -తిరుపతి	16.00	4830	22

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర		
టమాటాలు	18	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	44	చిక్కుడు కాయలు	96
వంకాయలు (కాంతులు)	50	చామదుంపలు	40
వంకాయలు (తెలుపు)	44	ములక్కాడలు	04-06
బెండకాయలు	24	కంద	48
పచ్చిమిర్చి	40	బీట్‌రూట్	36
కాకర కాయలు	20-24	కీరా దోస	40
బీరకాయలు	30	ఫ్రెంచ్‌బీన్స్	80
క్యాబేజీ	24	అల్లం	120-240
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	30
దొండకాయలు	24	పాలకూర	10
బంగాళదుంపలు	26	చుక్కకూర	10
ఉల్లిపాయలు	30	తోటకూర	10
గోరుచిక్కుడు	34	గోంగూర	06
దోసకాయలు	26-30	పుదీనా	05
ఆనబకాయ (1)	15-20	క్యాప్సికమ్	70
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	48
		నిమ్మకాయలు (డజను)	--